

‘రామా బ్లూ’ చీరలో నిర్మల..

బడ్జెట్ ప్రవేశ పెట్టే ప్రతిసారీ ప్రత్యేకమైన చీరలను కట్టుకునే నిర్మల.. ఈసారి కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగించారు. నీలి, గోధుమ రంగులో ఉన్న టస్సర్ చేనేత పట్టు చీరను ధరించారు. చీర మొత్తం నీలి రంగులో ఉండగా, దానిపై గోధుమ రంగులో ‘కాంత’ ఎంబ్రాయిడరీ వర్క్ ఉంది. ఈ ఎంబ్రాయిడరీ వర్క్ ను పశ్చిమ బెంగాల్, ఒడిశాలో చేస్తుంటారు. నీలి రంగును ‘రామా బ్లూ’ అని కూడా పిలుస్తుంటారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠకు ప్రతీకగా ఈసారి నీలి రంగు చీరను నిర్మల కట్టుకున్నారు.

మొరార్జీ రికార్డును సమం చేసిన నిర్మల

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు బడ్జెట్ ను ప్రవేశ పెట్టి మొరార్జీ దేశాయ్ రికార్డును సమం చేశారు. మొరార్జీ తర్వాత వరుసగా ఆరుసార్లు బడ్జెట్ ను ప్రవేశ పెట్టిన రెండో ఆర్థిక మంత్రిగా నిర్మల రికార్డు సృష్టించారు. ఆమె ఆర్థిక మంత్రిగా జులై 2019లో బాధ్యతలు చేపట్టారు. దేశంలోనే పూర్తిస్థాయి ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి మహిళగా ఘనతను దక్కించుకున్నారు. ఆమె ఇప్పటికే ఐదు సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ ను సమర్పించారు. గురువారం ప్రవేశపెట్టినది ఆమెకు మొదటి తాత్కాలిక బడ్జెట్. గతంలో ఆర్థికమంత్రులుగా పని చేసిన మన్మోహన్ సింగ్, అరుణ్ జైట్లీ, పి. చిదంబరం, యశ్వంత్ సిన్హా వరుసగా ఐదుసార్లు పూర్తి స్థాయి బడ్జెట్ ను ప్రవేశపెట్టగా, తాజా తాత్కాలిక బడ్జెట్ తో నిర్మల వారి రికార్డును అధిగమించారు.



56 నిమిషాలే ప్రసంగం..

నిర్మలా సీతారామన్ బడ్జెట్ స్పీచ్ కేవలం 56 నిమిషాల్లోనే ముగిసింది. ఆమె ఇప్పటి వరకు ఆరుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టగా, అందులో ఇదే అతి చిన్న ప్రసంగం. 2020లో ప్రవేశపెట్టిన బడ్జెట్ సందర్భంగా అత్యధికంగా 2గంటల 40నిమిషాలు నిర్మల మాట్లాడారు. ఇక 2019లో 2గంటల 17నిమిషాలు, 2021లో ఒక గంట 50 నిమిషాలు, 2022లో ఒక గంట 32 నిమిషాలు, 2023లో ఒక గంట 27 నిమిషాలు ప్రసంగించారు.



వికసిత్ భారత్‌కు పునాది


యువత, పేదలు, మహిళలు, రైతుల సాధికారత లక్ష్యంగా బడ్జెట్: మోదీ

- **క్యాపిటల్ ఎక్స్ పెండిచర్ రూ. 11 లక్షల కోట్లకు పెంచడం చరిత్రాత్మకం**
- **3 కోట్ల మహిళలను లక్షాధికారులు చేయాలన్న టార్గెట్ భేష్ అని ప్రశంసలు**

న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ అభివృద్ధి చెందిన భారతదేశ పునాదిని బలోపేతం చేసే దిశగా ఒక గ్యారంటీ బడ్జెట్ లా నిలిచిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ బడ్జెట్ ఆత్మవిశ్వాసాన్ని కొనసాగించేలా ఉందన్నారు. గురువారం కేంద్ర ప్రభుత్వ మధ్యంతర బడ్జెట్ పై ఆయన టీవీ చానెల్ ద్వారా మాట్లాడారు. అభివృద్ధి చెందిన ఇండియా (వికసిత్ భారత్) కు నాలుగు మూలస్తంభాలు అయిన యువత, పేదలు, మహిళలు, రైతుల సాధికారతకు ఈ బడ్జెట్ దోహదం చేస్తుందన్నారు. దేశ యువత ఆకాంక్షలను ప్రతిబింబించే ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తును సృష్టించేందుకు తోడ్పడుతుందన్నారు. ద్రవ్యలోటును నియంత్రణలో ఉంచుతూనే క్యాపిటల్ ఎక్స్ పెండించర్ ను రూ. 11.11 లక్షల కోట్లకు పెంచడం చరిత్రాత్మక నిర్ణయమని ప్రధాని ప్రశంసించారు. దేశంలో లక్షలాది మంది కొత్త ఉపాధి అవకాశాలు దొరికేలా బడ్జెట్ కు రూపకల్పన జరిగిందన్నారు. ఇది కేవలం మధ్యంతర బడ్జెట్ మాత్రమే కాదని.. ఇన్ క్లూసివ్, ఇన్నోవేటివ్ బడ్జెట్ అని చెప్పారు. రీసెర్చ్, ఇన్నోవేషన్ రంగాలకు రూ. లక్ష కోట్లు కేటాయించడం, స్టార్టప్ లకు రిబేట్లు ప్రకటించడం కూడా చరిత్రాత్మక నిర్ణయమన్నారు.

పేదలకు మరో 2 కోట్ల ఇండ్లు..

పేదలు, మధ్యతరగతి ప్రజల కోసం గ్రామాలు, పట్టణాల్లో 4 కోట్ల ఇండ్లు కట్టించామని, ఇప్పుడు మరో 2 కోట్ల ఇండ్ల నిర్మాణానికి కేంద్రం సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు. మహిళల్లో 2 కోట్ల మందిని లక్షాధికారులను చెయ్యాలని టార్గెట్ గా పెట్టుకున్నామని, ఇప్పుడు ఈ టార్గెట్ ను 3 కోట్లకు పెంచామన్నారు. పేదలకు ఆయుష్మాన్ భారత్ పథకం ఎంతో ఉపయోగపడుతోందని, ఈ పథకాన్ని అంగన్ వాడీ, ఆశా వర్కర్లకూ విస్తరిస్తామన్నారు. రూఫ్ టాప్ సోలార్ స్కీం ద్వారా కోటి కుటుంబాలకు ఉచిత కరెంట్ అందడమే కాకుండా అదనపు కరెంట్ ను ప్రభుత్వానికి అమ్మడం ద్వారా ఏటా రూ. 15 వేల నుంచి 18 వేల ఆదాయం పొందేందుకు కూడా వీలవుతుందని ప్రధాని చెప్పారు. బడ్జెట్ లో ప్రకటించిన ట్యాక్స్ రెమిషన్ స్కీంతో మధ్యతరగతికి చెందిన కోటి మంది ప్రజలకు ఊరట లభిస్తుందన్నారు. నానో డీఏపీ, మత్స్య సంపద యోజన, ఆత్మ నిర్భర్ ఆయిల్ సీడ్ క్యాంపెయిన్ వంటివి రైతుల ఖర్చులు తగ్గేందుకు, ఆదాయం పెరిగేందుకు ఉపయోగపడతాయన్నారు.





పెరుగు, చక్కెరతో నోరు తీపి..

పార్లమెంట్ లో బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నిర్మలా సీతారామన్ కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి పెరుగు, చక్కెరతో నిర్మల నోరు తీపి చేశారు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

గరీబ్ కల్యాణ్.. దేశ్ కా కల్యాణ్



2047 నాటికి పేదరికం లేని భారత్ మా లక్ష్యం బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మల

- పదేండ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి విముక్తి పొందారు
- ప్రజల ఆదాయం దాదాపు 50శాతం పెరిగింది
- పేదలు, మహిళలు, యువత, రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం
- సోషల్ జస్టిస్ కొందరికి పొలిటికల్ స్లోగన్.. దాన్ని మేం ఆచరిస్తున్నం
- అవకాశాలు సృష్టించడంలో మనకు ఆకాశమే హద్దు
- మోదీ స్లోగన్ ‘జై జవాన్.. జై కిసాన్.. జై విజ్ఞాన్.. జై అనుసంధాన్’ అని వెల్లడి

న్యూఢిల్లీ: పేదల అభ్యున్నతికి, పేదిరక నిర్మూలనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే.. దేశ సంక్షేమం (గరీబ్ కల్యాణ్.. దేశ్‌కా కల్యాణ్) అని పేర్కొన్నారు. 2047 నాటికి పేదిరకం లేని భారత్ గా దేశాన్ని నిలబెట్టడమే తమ లక్ష్యమని, పదేండ్లలో 25 కోట్ల మంది పేదిరకం నుంచి విముక్తి పొందారని ఆమె తెలిపారు. 2024 ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను గురువారం పార్లమెంట్‌లో నిర్మల ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రసంగాన్ని చదివారు. పదేండ్లలో తమ ప్రభుత్వం చేసిన పనులు, భవిష్యత్ లక్ష్యాలను వివరించారు. బడ్జెట్‌లో ఆమె కీ పాయింట్స్ చెప్తున్నప్పుడు ప్రధాని మోదీ సహా బీజేపీ సభ్యులు బల్లలు చరుస్తూ హర్షం వ్యక్తం చేశారు.

పేదరికం, అసమానతలు లేని దేశంగా..!

ఎన్నో సవాళ్ల నడుమ 2014లో తమ ప్రభుత్వం ఏర్పడిందని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ పదేండ్లలో అన్నిరంగాల్లో మార్పు కోసం మోదీ నాయకత్వంలో కృషి చేశామని, అది మంచి ఫలితాలను ఇస్తున్నదని చెప్పారు. దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్త జోష్ కనిపిస్తున్నదని, అభివృద్ధి ఫలాలు ఆఖరి వరుస వారికి కూడా అందుతున్నాయని పేర్కొన్నారు. కరోనా లాంటి ప్యాండమిక్‌ను కూడా ఎదుర్కొని దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా నిలబడిందని తెలిపారు. అభివృద్ధి అనేది గ్రామాల నుంచి జరగాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. ‘‘హౌసింగ్ ఫర్ ఆల్.. హర్ ఘర్ జల్.. ఎలక్ట్రిసిటీ ఫర్ ఆల్.. కుకింగ్ గ్యాస్ ఫర్ ఆల్.. బ్యాంక్ అకౌంట్, ఫినాన్స్ సర్వీస్ ఫర్ ఆల్ వంటి కార్యక్రమాలు విజయవంతంగా సాగుతున్నాయి. 80 కోట్ల మందికి ఫ్రీ రేషన్ స్కీమ్ అమలవుతున్నది. రైతులకు మద్దతు ధర లభిస్తున్నది. అన్నిరంగాలు అభివృద్ధి బాటలో పయనిస్తున్నాయి’’ అని ఆర్థిక మంత్రి వివరించారు. పేదరికం, అసమానతలు లేని దేశంగా భారత్‌ను తీర్చిదిద్దాలన్న కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నామని, 2047 వరకు వికసిత్ భారత్ కల సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ నిలిచేందుకు ఈ బడ్జెట్ ఓ గ్యారంటీ అని పేర్కొన్నారు.

నాలుగు వర్గాలకు టాప్ ప్రయారిటీ

సోషల్ జస్టిస్ అనేది కొందరికి పొలిటికల్ స్లోగన్‌గా మారిందని, కానీ దాన్ని తమ ప్రభుత్వం ఆచరణలో చూపిస్తున్నదని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కుల, మత, ఆర్థిక బేధాలు లేకుండా అన్నివర్గాలకు సమానవకాశాలు కల్పిస్తున్నామని, సామాజిక న్యాయం అందిస్తున్నామని చెప్పారు. దేశంలో ఉన్నవి నాలుగు కులాలేనని.. అవి పేదలు, మహిళలు, యువత, రైతులు అని తెలిపారు. తమ ప్రభుత్వం ఈ నాలుగు వర్గాల అభివృద్ధికి టాప్ ప్రయారిటీ ఇస్తున్నదని పేర్కొన్నారు. పదేండ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి స్వేచ్ఛను పొందారని, రాబోయే రోజుల్లో ఇది మరింత పెరుగుతుందని చెప్పారు. మహిళలు అన్నిరంగాల్లో రానిస్తున్నారని, నారీశక్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు 30 కోట్ల ముద్ర యోజన లోన్లు ఇచ్చామని ఆమె చెప్పారు. ట్రిపుల్ తలాక్‌ను నిషేధించామని.. లోక్‌సభ, రాష్ట్రాల్లోని అసెంబ్లీల్లో మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్లు దక్కుతున్నాయని వివరించారు. పీఎం ఆవాస్ యోజన కింద పేదలకు ఇండ్లు కట్టిస్తున్నామని, ఇందులో 70 శాతం మహిళల పేర్ల మీదనే ఇస్తున్నామని, ఇది ఆడబిడ్డ డిగ్నిటీకి ప్రతీక అని పేర్కొన్నారు. పీఎం ఆవాస్ యోజన కింద 3 కోట్ల ఇండ్ల నిర్మాణం దాదాపు పూర్తయిందని, వచ్చే ఐదేండ్లలో మరో 2 కోట్ల ఇండ్ల నిర్మాణం చేపడ్తామని ప్రకటించారు. దేశాన్ని పోషిస్తున్న అన్నదాతకు అండగా నిలుస్తున్నామని, వ్యవసాయానికి సాంకేతికను జోడిస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్ సమ్మాన్‌యోజన కింద పెట్టుబడి సాయం ఇస్తున్నామని గుర్తుచేశారు. 78 లక్షల మంది వీధి వ్యాపారులకు పూచీకత్తు లేని లోన్లు అందించామని పేర్కొన్నారు. పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికీ ఆర్థిక భరోసా దక్కుతున్నదని ఆమె తెలిపారు.

జీడీపీకి కొత్త అర్థం

గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త అర్థం చెప్పారు. దేశ జీడీపీలో మంచి అభివృద్ధి కనిపిస్తున్నదని, జీడీపీ అంటే.. ‘గవర్నెన్స్, డెవలప్‌మెంట్, ఫర్‌ఫార్మెన్స్’ అని పేర్కొన్నారు. సిటిజన్ ఫస్ట్ అనేది తమ నినాదామని అన్నారు. ప్రజల ఆదాయం యావరేజ్ గా 50శాతం పెరిగిందని, కరోనాలాంటి కష్టకాలంలోనూ ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉందని పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని, లక్ష్యద్వీప్ లాంటి ప్రాంతాల్లో టూరిజం డెవలప్‌మెంట్‌కు కట్టుబడి ఉన్నామని వివరించారు. కరోనా లాంటి ప్యాండమిక్‌ను చాలెంజ్‌గా ఎదుర్కొని కూడా జీ20 సమిట్‌కు మన దేశం ఆతిథ్యం ఇచ్చిందని, విజయవంతంగా దాన్ని నిర్వహించిందని తెలిపారు. ఇండియా మిడిలిస్ట్ యూరప్ ఎకనామిక్ కారిడార్‌తో మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. ‘‘మిషన్ ఫర్ వికసిత్ భారత్.. లక్ష్యంగా ముందుకు వెళ్తున్నం. వచ్చే ఐదేండ్లలో ఇది సాధ్యమవుతుంది. లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు ‘జైజవాన్.. జై కిసాన్’ అని పిలుపునిస్తే.. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ‘జై జవాన్.. జై కిసాన్.. జై విజ్ఞాన్’ అని పిలుపునిచ్చారు... ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ‘జైజవాన్.. జై కిసాన్.. జైవిజ్ఞాన్.. జై అనుసంధాన్’ అని ముందుకు సాగుతున్నారు’’ అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.

కొత్త మెడికల్ కాలేజీల కోసం కమిటీ

నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ –2020 ద్వారా విద్యారంగంలో ఎన్నో మార్పులు వచ్చాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల అన్నారు. స్కిల్ ఇండియా మిషన్ ద్వారా 1.4 కోట్ల మంది యువత శిక్షణ పొందారని తెలిపారు. పదేండ్లలో కొత్తగా 3వేల ఐటీఐలు, 7 ఐఐటీలు, 16 ట్రిపుల్ ఐటీలు, 7 ఐఐఎంలు, 15 ఎయిమ్స్, 390 యూనివర్సిటీలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వైద్య వృత్తిని చేపట్టాలని చాలా మంది భావిస్తుంటారని, వారి కలలను సాకారం చేసేందుకు కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం కమిటీని నియమిస్తున్నట్లు ఆమె ప్రకటించారు. అవకాశాలను సృష్టించడంలో ఆకాశమే హద్దుగా మన దేశం ముందుకు వెళ్తున్నదన్నారు.

ఆటల్లో సత్తా చాటుతున్న యువత

స్పోర్ట్స్‌లో మన దేశ యువత సత్తా చాటుతున్నదని నిర్మలా సీతారామన్ కొనియాడారు. ‘‘స్పోర్ట్స్‌లో యువత ఎంతో ప్రతిభ కనబరుస్తున్నది. వారిని చూసి దేశం గర్విస్తున్నది. ఏషియన్ గేమ్స్, ఏషియన్ పారాగేమ్స్‌లో మనవాళ్లు ఎన్నో మెడల్స్ సాధించారు. 2023 చెస్ చాంపియన్స్‌లో ప్రజ్ఞానంద్ గట్టిపోటీ ఇచ్చాడు. ఇలాంటి ఎందరో ఆణిముత్యాలకు మన దేశం పుట్టినిల్లు. ఇండియాలో ఇప్పుడు 80 మంది చెస్ గ్రాండ్ మాస్టర్‌లు ఉన్నారు’’ అని ఆమె వివరించారు.

రూపాయి (పైసల్లో)



ఇట్ల వస్తది		ఇట్ల పోతది	
28	అప్పులు, ఇతర రుణాలు	పెన్షన్లు	04
17	కార్పొరేట్ ట్యాక్స్	సబ్సిడీలు	06
18	జీఎస్టీ	డిఫెన్స్	08
19	ఇన్‌కమ్ ట్యాక్స్	సెంట్రల్లీ స్పాన్సర్డ్ స్కీమ్స్	08
07	నాన్ ట్యాక్స్ రెవెన్యూ	ఫైనాన్స్ కమిషన్, ఇతర ట్రాన్స్‌ఫర్లు	08
07	ఎక్సైజ్ డ్యూటీ	ఇతర వ్యయాలు	09
01	రుణేతర క్యాపిటల్ ఆదాయం	సెంట్రల్ సెక్టార్ స్కీమ్స్	16
04	కస్టమ్స్	వడ్డీ చెల్లింపులు	20
		ట్యాక్స్‌లు, డ్యూటీల్లో రాష్ట్రాల వాటా	20

10 వేల ఎలక్ట్రిక్ బస్సులు

బడ్జెట్‌లో రూ. 1,300 కోట్లు కేటాయింపు

మెట్రోలకు రూ.24 వేల కోట్ల నిధులు

న్యూఢిల్లీ: దేశంలో మెట్రో ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం 2024-25 మధ్యంతర బడ్జెట్‌లో రూ.24,931 కోట్లు కేటాయించింది. అలాగే ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు కోసం రూ.1,300 కోట్లు అలాట్ చేసింది. అర్బన్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ అభివృద్ధికి కేంద్రం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. మధ్యతరగతి వేగంగా విస్తరిస్తోందని, అర్బనైజేషన్ ఫాస్ట్‌గా పెరుగుతోందని.. దేశంలోని వివిధ మెట్రో లలో ప్రతి రోజు కోటి మంది ప్రయాణిస్తున్నారని ఆమె చెప్పారు. పెరుగుతున్న అర్బనైజేషన్‌కు మెట్రో లు, నమో భారత్ రైళ్లు ఉత్ప్రేరకాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్, మెట్రో ప్రాజెక్టులకు గత బడ్జెట్‌లో రూ.23,175 కేటాయించగా ప్రస్తుతం 7.57 శాతం నిధులు పెంచినట్లు చెప్పారు. బడ్జెట్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (అర్బన్) కోసం రూ. 26,170 కోట్లు కేటాయించారు. అలాగే స్వచ్ఛ భారత్ మిషన్‌కు రూ.5,000 కోట్లు కేటాయించారు. పీఎంఈబస్ సేవా పథకం కింద ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేందుకు రూ.1,300 కోట్లు కేటాయించారు. ఈ స్కీమ్ కింద ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్య విధానంలో 169 సిటీలకు 10 వేల ఎలక్ట్రిక్ బస్సులు అందివ్వనున్నారు. 2037 వరకు కొనసాగే ఈ స్కీమ్‌కు మొత్తం రూ.57,613 కోట్లు ఖర్చు చేయనున్నట్లు కేంద్రం గతంలో తెలిపింది. ఇందులో రూ.20 వేల కోట్లు కేంద్రం, మిగతా మొత్తాన్ని రాష్ట్రాలు భరిస్తాయి.



2047 లక్ష్యానికి రోడ్‌మ్యాప్

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్ ఆశాజనకంగా ఉంది. ఇది 2047 నాటికి భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు రోడ్‌మ్యాప్‌గా ఉపయోగపడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థ 2027 నాటికి 5 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని నేను హామీ ఇస్తున్నాను. 2030 నాటికి ఇది 7 ట్రిలియన్ డాలర్లకు పైగా పెరుగుతుంది. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా తయారవుతుంది. బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలు, నిర్మాణం, తయారీ, హౌసింగ్, టెక్నాలజీ రంగాల అభివృద్ధికి పెద్దపీట వేశాం.

- **రాజ్‌నాథ్ సింగ్,** రక్షణ శాఖ మంత్రి





మోదీ హామీలకు అనువైన బడ్జెట్

ప్రధాని నరేంద్ర మోదీ పదేండ్ల క్రితం చేసిన వాగ్దానాలకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ బడ్జెట్ తో కేంద్రం దేశంలోని ప్రతి రంగాన్ని అభివృద్ధి చేయనుంది. ప్రతి పౌరుడికి సామాజిక భద్రత కల్పించనుంది. అంతేగాక దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ బడ్జెట్ కీలక పాత్ర పోషించనుంది. 2047 నాటికి మన దేశం నిస్సందేహంగా బలమైన, అత్యంత అభివృద్ధి చెందిన దేశంగా అవతరించనుంది.

- **శర్బానంద సోనోవాల్,** షిప్పింగ్ మంత్రి

దేశాన్ని ఆర్థిక శక్తిగా మారుస్తది

ఈ మధ్యంతర బడ్జెట్ 2047 నాటికి మన దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చనుంది. దీనివల్ల భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుంది. బడ్జెట్ లో మౌలిక సదుపాయాలు, సామాజిక రంగం, వ్యవసాయం వంటి ప్రతి రంగంపై ఫోకస్ పెట్టారు. దేశాన్ని ప్రపంచంలోనే అత్యంత నమ్మకమైన, బలమైన ఆర్థిక శక్తిగా మార్చడానికి తీసుకున్న నిర్ణయాలు ప్రశంసనీయం.

- **కిరెన్ రిజిజు,** ఎర్త్ సైన్సెస్ మంత్రి

